
సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 28 । మే । 2023



ఆకేపాటి సేవలు స్ఫూర్తిదాయకం

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేద ప్రజలకు చేస్తున్న సేవలు స్ఫూర్తి దాయకమని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కొనియాడారు. -8లో..



హోదాకు దగ్గరైన గండికోట

గండికోటకు ప్రపంచ వారసత్వ హోదా అంశం మరోమారు తెరపైకి వచ్చింది. ఈ విషయం తెలిసిన పర్యాటక ప్రముఖుల్లో హర్షం వ్యక్తమవుతోంది. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.66	రూ.98

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 919 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	355	455
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 221.30 కిలోలు

న్యూస్‌రీల్

4న 'కేతు' సంస్మరణ సభ

కడప కల్చరల్: ఇటీవల కన్నుమూసిన ప్రముఖ కథకులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సంస్మరణ సభను జూన్ 4న ఉదయం 9 గంటలకు సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించనున్నారు. జిల్లా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి.సురేష్‌బాబు ఈ విషయాన్ని తెలిపారు. అరసంతోపాటు జిల్లాలోని వివిధ సాహితీ సంస్థలు, సామాజిక సేవా సంస్థలు, బ్రౌన్ గ్రంథాలయం ఉమ్మడి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అభిమానులు, ఆత్మీయులు, బంధుమిత్రులు, సాహితీవేత్తలు కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా 62 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియేట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ మొదటి, రెండో సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 17,444 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 16,637 మంది పరీక్షలు హాజరయ్యారని తెలిపారు 95.37 శాతం హాజరయ్యారు. 807 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను పూర్తిగా సీసీ కెమెరాల నిఘాలో ఉంచినట్లు ఆర్ఐఓ ఎస్వీ రమణరాజు తెలిపారు. పటిష్టమైన భద్రతా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ విజయవాడ 8వ బ్యాచ్ డిప్లొమా ఇన్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర అప్లికేషన్ కోర్సునకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ బి. గుర్రప్ప తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ డిప్లొమాకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైనందని, కోర్సును కడప లోని సహకార శిక్షణ కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కోర్సు వ్యవధి 6నెలలకుగాను, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని అన్ని రకాల సహకార సంఘాల్లో, సహకార బ్యాంకుల్లో పనిచేస్తున్న అభ్యర్థులకు పదోతరగతి, ఇతర అభ్యర్థులకు ఇంటర్మీడియట్ అర్హతగా పేర్కొన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగినవారు అర్హులన్నారు. జూలై 1 తేదీ లోపు రూ.6900/- కోర్సు ఫీజును ఎస్‌బీఐ అకౌంట్‌లో ఆన్‌లైన్ ద్వారా జమచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 96181 20532, 9573616794 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. కోర్సు తరగతులు జూలై 3వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

గాలివాన బీభత్సం



కమలాపురం: ఎన్టీఆర్ కాలనీలో బైక్‌పై పడిన చెట్టు

కమలాపురం/రాజుపాళెం: వైఎస్సార్ జిల్లాలో శనివారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులు, వడగండ్ల వర్షం కురిసింది.కమలాపురం పట్టణంలో ఉన్నట్టుండి వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది.అరగంట పాటు ఏక ధాటిగా వర్షం కురిసింది. దీంతో పలు కాలనీల్లో నీరు నిలిచాయి. గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. ఎన్టీఆర్ కాలనీలో రత్న రాజు అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై చెట్టు పడటంతో దెబ్బతింది.రాజుపాళెం మండలంలోని వాసుదేవాపురంలో శనివారం సాయంత్రం విద్యుత్ స్తంభం విరిగి గుర్రమ్మ అనే మహిళపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుకు అడ్డంగా చెట్టు పడటంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు

దువ్వూరు: మండల పరిధిలోని గుడిపాడు, భీమునిపాడు, బుక్కాయపల్లె, ఏఎస్‌పల్లె గ్రామాల్లో శనివారం సాయంత్రం గాలివానకు పొలాల్లోని విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, చెట్లు నేలకొరిగాయి. 30 విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను త్వరగా పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

ఆర్టీసీలో బ్రేక్ జర్నీ

- దూర ప్రాంతాలకు వెళ్లే వారికి సౌలభ్యం
- ఒకే టిక్కెట్టుతో ప్రయాణం
- రాయలసీమ నుంచి పలు నగరాలకు కనెక్టివిటీ సదుపాయం



కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇప్పటివరకు విమాన ప్రయాణికులకు మాత్రమే పరిమితమైన బ్రేక్ జర్నీ సదుపాయం ప్రస్తుతం ఆర్టీసీ ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు బస్సు మారిన ప్రతిసారి టిక్కెట్టును తీసుకునే వారు. ఇకపై అలాంటి అవసరం లేకుండా మల్టీ సిటీ టిక్కెటింగ్ సౌలభ్యాన్ని ఆర్టీసీ కల్పించింది. ఏదైనా పట్టణం నుంచి దూర ప్రాంతంలో ఉన్న మరో పట్టణానికి లేదా నగరానికి వెళ్లడానికి నేరుగా బస్సు సదుపాయం ఉండడం లేదు. ఇలాంటి వారు తాము వెళ్లేబోయే ప్రాంతానికి ఎక్కడి నుంచి బస్సు సౌకర్యం ఉందో అక్కడికి చేరుకోవాల్సి ఉండేది. ఇకపై తాము బయలుదేరే చోటునుంచే వెళ్లే గమ్యస్థానానికి ఆన్‌లైన్ ద్వారా ఒకేసారి నేరుగా టిక్కెట్‌ను పొందవచ్చు. ఉదాహరణకు కడప నుంచి శ్రీకాకుళం వెళ్లాలంటే డైరెక్టర్‌గా ఆర్టీసీ సర్వీసు లేదు. విశాఖపట్టణం ఒక బస్సులో వచ్చి శ్రీకాకుళం వెళ్లాలంటే మరో బస్సు ఎక్కి టిక్కెట్ తీసుకోవాల్సి వచ్చేది. ఇది వ్యయ ప్రయాసలతో కూడుకుని ఉంది. అంతేకాకుండా వీరు ఎక్కిన ప్రతి బస్సులోనూ రిజర్వేషన్ కోసం ఇబ్బంది పడాల్సి వచ్చేది. అయితే ఈ మల్టీ సిటీ టిక్కెటింగ్ విధానంలో తాము వెళ్లే బస్సులో ఒకే రిజర్వేషన్ చార్జితో ప్రయాణించే వీలు కల్పించారు. మారే బస్సులోనూ ముందుగానే సీటు రిజర్వు అయి ఉంటుంది. ఆర్టీసీ కొత్తగా ప్రవేశపెట్టిన ఈ విధానంలో ప్రయాణికులు తమ గమ్యస్థానానికి వెళ్లేందుకు బ్రేక్ జర్నీ సదుపాయాన్ని కల్పించారు. తాము వెళ్లే బస్సుకోసం 2 గంటల నుంచి 22 గంటల వరకు వేచి ఉన్న బ్రేక్ జర్నీలో ఆ టిక్కెట్ చెల్లుబాటు అవుతుంది. ఒకవేళ ముందు వెళ్లే వారి బస్సు మార్గమధ్యలో ఎక్కడైనా మరమ్మతుకు గురైతే ఆ ప్రయాణికుడిని మరో బస్సులో వెంటనే పంపించి ప్రయాణానికి ఆటంకం లేకుండా చూస్తారు.

రాయలసీమ ప్రాంతం నుంచి

రాయలసీమలోని 8 జిల్లాల నుంచి విశాఖ పట్టణం మినహా ఇతర దూర ప్రాంతాలకు నేరుగా ఆర్టీసీ బస్సు సదుపాయాలు లేవు. దీనిని దృష్టిలో పెట్టుకుని విశాఖ సహా శ్రీకాకుళం, విజయనగరం, భద్రాచలం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు మల్టీ సిటీ టిక్కెటింగ్ (బ్రేక్ జర్నీ) సదుపాయాన్ని ఆర్టీసీ కల్పించింది.

రాయలసీమ నుంచి మల్టీ సిటీ టిక్కెటింగ్ సదుపాయం ఇలా..

బయలుదేరే స్థలం	బ్రేక్ జర్నీ	గమ్యస్థానం
కడప	విజయవాడ	శ్రీకాకుళం
కడప	విశాఖపట్టణం	విజయనగరం
కడప	విజయవాడ	భద్రాచలం
ప్రొద్దుటూరు	విశాఖపట్టణం	శ్రీకాకుళం, విజయనగరం
తిరుపతి	విశాఖపట్టణం	శ్రీకాకుళం
చిత్తూరు	విజయవాడ	శ్రీకాకుళం
మదనపల్లె	విజయవాడ	విశాఖపట్టణం
అనంతపురం	విజయవాడ	శ్రీకాకుళం
పుట్టపర్తి	విజయవాడ	విజయనగరం
రాయచోటి	విజయవాడ	విశాఖపట్టణం

ప్రచారం నిర్వహిస్తున్నాం



ఆర్టీసీ యాజమాన్యం అందుబాటులోకి తీసుకొచ్చిన మల్టీ సిటీ టిక్కెటింగ్ సదుపాయంపై ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనిపై కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తున్నాం. టిక్కెట్ కౌంటర్లలోనూ ఈ విషయం తెలియజేస్తున్నాం. అక్కడక్కడ పోస్టర్లను కూడా ప్రదర్శించనున్నాం. ఈ కొత్త విధానంలో బ్రేక్ జర్నీకి వీలు కల్పిస్తున్నాం. కడప జోన్ వ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, తిరుపతి, చిత్తూరు, మదనపల్లె. పుట్టపర్తి, అనంతపురం, హిందూపురం డిపోల నుంచి బ్రేక్ జర్నీ సదుపాయం కల్పిస్తున్నాం.

– గోపినాథ్‌రెడ్డి, కడపజోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

తిరుమల ఘాట్ ఎత్తున శ్రీవారి పాదాలు

- స్తంభంపై గరుత్మంతుడు
- స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ మురళి



ఘాట్‌రోడ్డులో తిరుమలకొండ ఎత్తు చోటును పరిశీలిస్తున్న ఆర్డీఓ, అధికారులు

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లాలో ఏకైన పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డులో తిరుమల ఎత్తు కలిగిన చోట శ్రీవారి పాదాలను ఏర్పాటు చేసేందుకు శనివారం సాయంత్రం మదనపల్లె ఆర్డీఓ. హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్ ఎంఎస్.మురళి పరిశీలన చేశారు. హార్సిలీహిల్స్ సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులో ఉంది. ఇది తిరుమల కొండ కంటే ఎత్తయినది. కొండ కిందనుంచి పైకి వెళ్లేటప్పుడు నాలుగో మలుపు దాటిన తర్వాత తిరుమల కొండ 3,100 అడుగుల ఎత్తు కలిగిన చోటు ఉంది. దానిపైకి వెళ్లే కొండఘాట్ మొత్తం తిరుమల కొండకంటే ఎత్తయిన ప్రాంతం.కొండపై ప్రణాళికాబద్ధంగా చేపట్టిన పనుల్లో భాగంగా ఈ చోటులో స్తంభంపై గరుత్మంతుడి ఆకారం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు ఆర్డీఓ చెప్పారు. దీనికోసం రోడ్డు పక్కన స్థలాన్ని పరిశీలించారు. బండరాళ్లపై కంకర, మట్టితో చదునుచేసి దానిపై తూర్పు దిశగా శ్రీవారి పాదాలను ఏర్పాటు చేసి నిత్యం వెలిగేలా దీపం ఏర్పాటు చేయనున్నారు. అటవీప్రాంతానికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ చెప్పారు. ఈ స్థలం, పాదాల ఏర్పాటుకు పండితుల సలహాలు, సూచనలు తీసుకుని ముందుకు సాగుతామని తెలిపారు. అనంతరం హార్సిలీహిల్స్‌పై స్వాగత తోరణం నిర్మాణం, అటవీ సముదాయంలో అభివృద్ధి పనులు, ఏనుగుమల్లమ్మ ఆలయం వద్ద చేపట్టాల్సిన చర్యలపై పరిశీలించారు. పీఎంకే పట్టణాభివృద్ధి సంస్థ నిధులతో హార్సిలీహిల్స్ అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయించేలా సంస్థ పాలకమండలి సమావేశంలో తీర్మానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టూరిజం డీవీఎం మడితాటి గిరిధర్‌రెడ్డి, తహసీల్దార్ రఫీక్ అహ్మద్, ఆర్ఐ బాలాజీ, మేనేజర్ సాల్వీన్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్, వీఆర్‌ఓ ఖాదర్‌బాషా, సొసైటి కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

'బుక్ మై దర్శన్' పైలట్ ప్రాజెక్ట్‌గా తిరుమల



మడితాటి గిరిధర్‌రెడ్డి

బి.కొత్తకోట: రాష్ట్రంలో ఆలయాల దర్శనాల కోసం భక్తులు 'బుక్ మై దర్శన్' ద్వారా సేవలు పొందేందుకు ప్రయోగాత్మక కార్యక్రమానికి తిరుమలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు పర్యాటకశాఖ తిరుపతి డివిజనల్ మేనేజర్ మడితాటి గిరిధర్‌రెడ్డి చెప్పారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌పై టూరిజం అతిథిగృహాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'బుక్ మై దర్శన్' పేరుతో రాష్ట్రంలో వంద ప్రముఖ ఆలయాల ప్రాంతాల్లో కియోస్క్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆలయాల దర్శనకు వచ్చే భక్తులు రాష్ట్రంలోని మిగతా ఆలయాల దర్శనం, సేవల టికెట్ల బుకింగ్, ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లను ఈ కియోస్క్‌ల ద్వారా పొందవచ్చన్నారు. 15రోజుల్లో తిరుమలలో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభమవుతుందన్నారు. టీటీడీ ద్వారా టూరిజంకు రోజుకు వెయ్యి టికెట్లు ఇస్తున్నారని, దీన్ని రెండు వేలకు పెంచాలని కోరినట్టు చెప్పారు. తిరుమల-తిరుపతి స్థానిక ఆలయాల దర్శన ప్యాకేజీల ఆదాయం రూ.5 లక్షలు ఉండగా, దీన్ని రూ.20 లక్షలకు పెంచామని.. రూ.కోటి ఆదాయం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. భక్తులకు ఆలయాల విశిష్టతను తెలియచెప్పేలా అవగాహన కార్యక్రమాలను రూపొందిస్తున్నామన్నారు. తద్వారా మరింత ఆదాయం పెంచుకునేలా కృషి చేస్తున్నామని చెప్పారు. తిరుపతి, కడప డివిజన్లలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామన్నారు. ఏప్రిల్-మేలో తిరుపతి డివిజన్‌లో రూ.11 కోట్లు, కడప డివిజన్‌లో రూ.కోటి ఆదాయం వచ్చిందన్నారు. తంబళ్లపల్లె మల్లయ్యకొండ, బోయకొండ ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆయనవెంట స్థానిక మేనేజర్ నేదురుమల్లి సాల్విన్‌రెడ్డి ఉన్నారు.

రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తున్న బీజేపీ ప్రభుత్వం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్ జిల్లా కడపలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. నూతనంగా నిర్మించిన పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కాకుండా ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించడం ప్రజాస్వామ్యాన్ని కించపరచడమేనన్నారు. రాష్ట్రపతిని అవమానించడమేనన్నారు. ప్రధాని ప్రారంభించడాన్ని దేశంలోని 21 రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. దేశంలో సీబీఐ, ఈడీ, ఇన్‌కం ట్యాక్స్, గవర్నర్ వ్యవస్థల స్వతంత్ర్య ప్రతిపత్తిని దెబ్బతీస్తూ వాటి విలువలను దిగజారుస్తున్నారని మండిపడ్డారు. ఈ సమస్యలపై రానున్న రోజుల్లో మేధావులు, అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని చర్చావేదిక చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శిగాలి చంద్ర, నగర కార్యదర్శి వెంకట శివ, గంగాసురేష్ తదితరులు పాల్గొన్నారు.

- రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం కడపలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో ఏఐఎస్ఎఫ్ శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలో తెలిపిన విధంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమ, కేంద్ర విశ్వ విద్యాలయాలకు సంబంధించి అరకొర నిధులు కేటాయిస్తూ ప్రజలను మభ్యపెడుతోందన్నారు.ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, జిల్లా కార్యదర్శి వలరాజు, నాయకులు బండి చలపతి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశీయ కూరగాయల సాగును ప్రోత్సహించాలి

- శాస్త్రవేత్తల పిలుపు
- ఉద్యానకళాశాలలో జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సును ప్రారంభిస్తున్న ఉద్యాన వర్సిటీ డీన్ డాక్టర్ ఏఎస్.పద్మావతమ్మ తదితరులు

రైల్వేకోడూరు : దేశీయ, సంప్రదాయల కూరగాయల ప్రాముఖ్యతను గుర్తించాలని, వారి పరిరక్షణ, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని శాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. శనివారం అన్నమయ్య జిల్లా అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యానకళాశాలలో ఎథ్నిక్ విజిటబుల్స్ అనే అంశంపై జాతీయ సదస్సు ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును వర్సిటీ డీన్ డాక్టర్ ఏఎస్ పద్మావతమ్మ, అసోసియేట్ డీన్ డాక్టర్ కే.గోపాల్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్సిటీ డీన్ మాట్లాడుతూ దేశీయ కూరగాయల సాగును ప్రోత్సహించాలని, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని తెలిపారు. స్థానికంగా గుర్తింపు పొందిన రకాలను గుర్తించి వాటిని భద్రపరిచి భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. వీటిని సాగుచేయడం ద్వారా ఆ జాతులను పరిరక్షించడంతో పాటు పోషకాహార లోపాలను, ఆహార లోటును అధిగమించవచ్చన్నారు. ఇందుకోసం దేశంలోని వివిధ యూనివర్సిటీలు, పరిశోధనల సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం దేశీయ కూరగాయల విత్తనాలు, వివిధ రకాల కూరగాయల పంటలతో ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ సదస్సుకు 238 పరిశోధన పత్రాలు వచ్చినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ సూర్యకుమారి, రాయలసీమ జోనల్ హెడ్ కేటీ.వెంకటరమణ, అసోసియేట్ డీన్ డాక్టర్ విజయపద్మ, సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శులు సయ్యద్ సదరున్నీషా, పి.శ్యాంసుందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

రుణమస్తు

- రైతులకు అండగా.. వ్యాపారులకు దన్నుగా డీసీసీ బ్యాంకు
- 2023-24 ఆర్థిక సంవత్సర రుణ లక్ష్యం రూ. 1014 కోట్లు



కడపలోని డీసీసీ ప్రధాన బ్యాంకు

డీసీసీ బ్యాంకు ఏర్పాటైన సంవత్సరం : **1919**

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలో బ్రాంచిలు : **24**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు: **72**

డీసీసీ బ్యాంకులో గతేడాది వరకు ఇచ్చిన రుణాలు: రూ.**2547** కోట్లు

ఈ ఏడాది ఇవ్వనున్న రుణాలు: **1014** కోట్లు

ఈ ఏడాది చివరినాటికి లక్ష్యం: రూ.**3500** కోట్లు

కడప అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. పంటలసాగుకు అవసరమైన పెట్టుబడి రుణాలను సకాలంలో అందిస్తోంది. వీరితోపాటు వ్యాపారులకు, డ్వాక్రా సంఘాలకు సైతం అవసరం మేరకు రుణాలను అందిస్తూ ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ సాయాన్ని అందిపుచ్చుకుంటున్న రైతులు ఉత్సాహంగా సాగుకు సన్నద్ధమవుతున్నారు. జూన్ నెల నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభంకానుంది. ఇప్పటికే రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ తరుణంలో సాగుకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా సకాలంలో రుణాలను అందించేందుకు బ్యాంకులు సిద్ధమవుతున్నాయి. ఎవరెవరికి ఎంత రుణాలను ఇవ్వాలనే లక్ష్యాన్ని డీసీసీ బ్యాంకు ఖరారు చేసింది. ఇతర బ్యాంకులకంటే తక్కువ వడ్డీతో సకాలంలో రుణాలను అందించి వారి అభివృద్ధికి చేయూత నిస్తోంది.

డీసీసీ బ్యాంకు తరఫున జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ. 1014 కోట్ల రుణాలను మంజూరు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో వ్యవసాయ, స్వల్పకాలిక, దీర్ఘకాలిక, బంగారు ఆభరణాలు, వ్యవసాయేతర రుణాలు, డ్వాక్రా మహిళలకు రుణాలను ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో బంగారు అభరణాలపై రూ. 76 కోట్లు, వ్యవసాయ రుణాల కింద రూ. 80 కోట్లు, డ్వాక్రా సంఘాలకు రూ. 175 కోట్లు, సల్పకాలిక రుణాల కింద రూ. 100 కోట్లు, దీర్ఘకాలిక రుణాల కింద రూ. 309 కోట్లు, ఇతర రుణాలు కింద రూ. 84 కోట్లు, డిపాజిట్లు కింద రూ. 190 కోట్లు మొత్తం రూ. 1014 కోట్లు రుణాలను ఇవ్వాలనే లక్ష్యంతో అధికారులు కృషి చేస్తున్నారు. ఈ మేరకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

తక్కువ వడ్డీకే రుణాలు..

రైతులకు సంబంధించి పంట, పశుపోషణ రుణాలు, బంగారు అభరణాలపై 7 శాతం వడ్డీతో రుణాలు అందించనున్నారు.

- మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ. 20 లక్షల వరకు 8.30 శాతం వడ్డీతో రుణాలను అందించనున్నారు.
- ఇంతకుముందు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల మంజూరుకు 1 శాతం ప్రాసెసింగ్ ఫీజును వసూలు చేసే వారు. ఇప్పుడు అన్ని రకాల రుణాల మంజూకుకు ప్రాసెసింగ్ ఫీజు రద్దు చేశారు.
- గ్రామీణ ప్రాంతంలో రైతులకు గతంలో బ్యాంకు ప్రధాన బ్రాంచి నుంచి సిబ్బంది వెళ్లి పొలాలను తనిఖీ చేసిన తర్వాత రుణాలను మంజూరు చేసే వారు. ఇప్పుడు ఆలస్యం కాకుండా ఉండేందుకు ఇప్పుడు బ్రాంచి సిబ్బందికే అధికారాలను ఇచ్చారు.

అర్హులందరికీ రుణాలు



డీసీసీ బ్యాంకులో రుణాల మంజూరుకు ఎలాంటి సిఫార్సులు అవసరం లేదు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి మంజూరు చేస్తాం. కమర్షియల్ బ్యాంకులలాగా మా బ్యాంకుల్లో కూడా తక్కువ వడ్డీకే అందిస్తున్నాం. రుణాలను కావాల్సిన వారు పత్రాలను తీసుకొచ్చి, బ్యాంకులో సంప్రదించి అధికారులతో చర్చించవచ్చు. పరిశీలించి అర్హత ఉంటే రుణాలను మంజూరు చేయించుకోవచ్చు.

– కందుల రాజేంద్ర కుమార్, సీఈఓ., డీసీసీ బ్యాంకు. కడప.

జూన్ 15 నుంచి జెడ్పీటీసీలకు శిక్షణ

కడప సెవెన్‌రోడ్స్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన జెడ్పీటీసీలకు శ్రీకాళహస్తిలో మూడురోజుల పాటు ఫౌండేషన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ. మన్నూరు సుధాకర్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ జిల్లా అట్లూరు, బి.కోడూరు, బి.మఠం, బద్వేలు, చక్రాయపేట, చాపాడు, చెన్నూరు, సీకే దిన్నె, దువ్వూరు, గాలివీడు, గోపవరం, జమ్మలమడుగు, కలసపాడు, కమలాపురం, ఖాజీపేట, కొండాపురం, లింగాల, ముద్దనూరు, మైదుకూరు, మైలవరం, అన్నమయ్య జిల్లా చిన్నమండెం, చిట్వేలి, రైల్వేకోడూరు, లక్కిరెడ్డిపల్లె, జెడ్పీటీసీలు, కో ఆప్షన్ సభ్యులకు జూన్ 15 నుంచి 17వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అన్నమయ్య జిల్లా నందలూరు, ఓబులవారిపల్లె, పెనగలూరు, పుల్లంపేట, రాజంపేట, రాయచోటి, సంబేపల్లె, సిద్దవటం, రామాపురం, సుండుపల్లె,వీరబల్లి, వైఎస్సార్ జిల్లా పెద్దముడియం,పెండ్లిమర్రి, పోరుమామిళ్ల, ప్రొద్దుటూరు, రాజుపాలెం, కాశినాయన, సింహాద్రిపురం, తొండూరు, వల్లూరు, వేంపల్లె, వేముల, వీఎన్ పల్లె, ఎర్రగుంట్ల జెడ్పీటీసీలకు జూన్ 19 నుంచి 21వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని జెడ్పీ సీఈఓ తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


రఘు (ఫైల్)

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామ పంచాయతీ సంటిగారిపల్లెలో ఓ యువకుడు శనివారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సీ కాలనీలోని ఉరిమిళ్ళ రఘు (24) శనివారం రాత్రి స్నానం చేసి కట్ డ్రాయర్‌ను తంతి మీద ఆరేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి కిందపడి పోయాడు. వెంటనే వైద్యం కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతనికి ఏడాదిన్నర క్రితం వివాహం అయింది. భార్య, 3 నెలల పాప ఉన్నారు. ఈయన రైతు కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే వాడు. రఘు మృతి చెందడంతో బాధిత కుటుంబీకులు బోరున విలపించారు.


ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి


రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులు

మదనపల్లె : ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సబ్ కలెక్టరేట్ ఎదుట ఏపీజీఈఏ ఆధ్వర్యంలో డిమాండ్ల సాధనకై రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజీఈఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు యర్రపురెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించేలా చట్టం చేయాలన్నారు. 1993 సెప్టెంబర్ 25 కంటే ముందు నియమితులైన ఎన్.ఎమ్.ఆర్., డైలీవేజెస్, కంటింజెంట్ ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలన్నారు. అన్ని శాఖలలో డీఎస్సీ ద్వారా నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్ముకు భద్రత కల్పించాలన్నారు. రిటైర్మెంట్ రోజునే ఉద్యోగులకు అన్ని ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ మదనపల్లె తాలూకా అధ్యక్షులు యస్.నాగేంద్రబాబు, కార్యదర్శి ఆర్.శివరామ్‌ప్రసాద్, ట్రెజరర్ కల్యాణి, కార్యనిర్వాహక కార్యదర్శి శేషయ్య, ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్, గురుప్రసాద్, ఆర్.ధర్మయ్య, రమణ, వరలక్ష్మి, సరస్వతి, శేఖర్, మల్లికార్జున, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ హోదాకు దగ్గరైన గండికోట

- మిక్సెడ్ లిస్టులో స్థానం
- టెంటెటివ్ లిస్టులో లేపాక్షి


గండికోట ముఖ ద్వారం

కడప కల్చరల్ : గండికోట అభిమానులు ముఖ్యంగా వైఎస్సార్ జిల్లా వాసులు ఆనందించదగిన సమాచారం. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న కల సాకారం అయ్యే అవకాశం దగ్గర పడిందన్న ఆనందం. మన గండికోటకు ప్రపంచ వారసత్వ హోదా అంశం మరోమారు తెరపైకి వచ్చింది. ఈ విషయం తెలిసిన చరిత్ర అభిమానులు, పర్యాటక ప్రముఖుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాగా ప్రముఖ పర్యాటక ప్రాంతంగా ఖ్యాతి గడించిన మన గండికోటకు ప్రపంచ వారసత్వ హోదా దక్కే అవకాశం దగ్గరైంది. ఇందుకోసం రాష్ట్రంలోని మరికొన్ని వారసత్వ ప్రాంతాలతో కూడిన మిక్సెడ్ జాబితాలో గండికోట ప్రథమ స్థానంలో ఉంది. వివరాలిలా ఉన్నాయి.

గండికోటకు వారసత్వ హోదా సాధించాలని ఈ ప్రాంత చరిత్ర అభిమానులు, పర్యాటక సంస్థల ప్రతినిధులు చిరకాలంగా కృషి చేస్తున్నారు. ఆ హోదాకు అవసరమైన చారిత్రక, భౌగోళిక, సామాజిక పర్యాటక ప్రత్యేకతలన్నీ గండికోటకు ఉన్నాయి. ప్రతినెల పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ప్రత్యేకించి కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడుల నుంచి వారాంతాలలో పర్యాటక బృందాలు వస్తుంటాయి. అందుకే గండికోట ప్రపంచ వారసత్వ హోదా పోటీలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని మరికొన్ని ఇతర ప్రాంతాలకు చెందిన చారిత్రక ప్రదేశాలు కూడా వారసత్వ హోదా రేసులో ఉన్నాయి. అయినా గండికోటకు ఈ విషయంగా ప్రథమ స్థానం ఇచ్చేందుకు వారు కూడా అభ్యంతరం చెప్పలేదు.

వారసత్వ ప్రాంతం కోటాలోనే...

గండికోటకు చారిత్రక, వారసత్వ ప్రాంతంగా గొప్ప పేరుంది. ఇప్పటికి ఐదు సార్లు రాష్ట్ర ప్రభుత్వం (గండికోట) ఉత్సవాలను నాలుగు మార్లు వారసత్వ ఉత్సవాలుగానే నిర్వహించారు. రాష్ట్రంలో ఇతర ఏ జిల్లాలో కూడా ఇలా వారసత్వం పేరిట ఉత్సవాలు నిర్వహించలేదు. దీన్ని బట్టి రాష్ట్రంలోని అన్ని ఇతర చారిత్రక ప్రాంతాల కంటే ప్రపంచ వారసత్వ హోదాకు తొలి అర్హత గండికోటకే ఉందని మన ప్రాంతీయులు ఎంతో ఆశించారు. తొలి ఉత్సవాల నుంచి స్థానిక వారసత్వ, పర్యాటక సంస్థలు, అధికారులు, ప్రజాప్రతినిధులు వారసత్వ హోదా కోసం డిమాండ్ చేస్తూనే ఉన్నారు.

మందగమనం

ఆ తర్వాత ఈ విషయంలో వేగం మందగించడం దురదృష్టకరం. కేంద్రంపై ఒత్తిడి తెచ్చిన తెలంగాణ అనూహ్యంగా అక్కడి రామప్ప గుడికి ఆ హోదాను దక్కించుకోగలిగింది. అదే సమయంలో మన ప్రాంతంలో ఈ అంశంపై అవసరమైన చర్యలు చేపట్టడంలో మనం కాస్త వెనుకబడ్డాం. భద్రాచలం స్థానంలో రాష్ట్ర దేవాలయంగా ఒంటిమిట్టను దక్కించుకోవడంలో చూపిన చురుకుదనం, తెచ్చిన ఒత్తిడి గండికోట విషయంలో మందగించింది. నిజానికి గండికోటకు యునెస్కో గుర్తింపు లభిస్తే మన జిల్లాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు, గౌరవం లభిస్తాయి. గండికోట వారసత్వ సంపద రక్షణ, ఆ ప్రాంత అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు వచ్చే అవకాశం ఉంది. దీన్ని గమనించిన గండికోట వీరాభిమానులు, అఖిల భారత పంచాయత్ పరిషత్ చైర్మన్ జాస్తి వీరాంజనేయులు కేంద్రం స్థాయిలో పురావస్తు, పర్యాటకశాఖల అధికారులను, గండికోట ప్రాధికార సంస్థ అధ్యక్షులు పెమ్మసాని ప్రభాకర్‌నాయుడు రాష్ట్ర అధికారులను కలుస్తూ ఈ విషయంపై ఒత్తిడి తెస్తున్నారు. గండికోట కూడా వారసత్వ రేసులో నిలబడింది. ఈలోపు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యాటకంగా గండికోటకు ప్రాధాన్యతను పెంచి అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఉపక్రమించడంతో వారసత్వ అంశంపై కూడా ఒత్తిడి పెరిగింది. ఫలితంగా ఇటీవల యునెస్కో ప్రచురించిన మిక్సెడ్ జాబితాలో రాష్ట్రంలోని మరో నాలుగు ప్రాంతాలతో కలిపి గండికోటకు స్థానం లభించింది. పొరుగు జిల్లా అనంతపురానికి చెందిన లేపాక్షి నంది వారసత్వ హోదా తాత్కాలిక జాబితాలో చోటు లభించింది. దీంతో మనకంటే ముందు లేపాక్షికే వారసత్వ హోదా దక్కే అవకాశం మెరుగైంది. ఇప్పటి నుంచి గండికోటపై మన జిల్లాలోని అన్ని రంగాల ప్రముఖులు ఒత్తిడి తెస్తే వారసత్వ హోదాకు కొద్దిదూరంలో అంటే మిక్సెడ్ జాబితాలో ఉన్న గండికోట తాత్కాలిక జాబితాలోకి వచ్చి అనంతరం వారసత్వ వైభవం దక్కే అవకాశం ఉంది. వారసత్వ, చరిత్రకారులు, పర్యాటక సంస్థలు, ప్రజాప్రతినిధులు ఈ తరుణంలో ఈ అంశంపై గట్టి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పారదర్శకంగా బదిలీలు


మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలోని పోలీసు శాఖలో జరుగుతున్న బదిలీలను పారదర్శకంగా చేస్తామని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. వివిధ పోలీసు స్టేషన్లలో ఐదేళ్ల నుంచి పని చేస్తున్న ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్స్, పోలీసు కానిస్టేబుల్స్‌కు మే 27న జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్‌లో బదిలీల ప్రక్రియ నిర్వహించారు. శనివారం అన్నమయ్య జిల్లా రాయచోటిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ పోలీసు సిబ్బందితో స్వయంగా మాట్లాడి బదిలీలపై నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా బదిలీకోసం వచ్చిన సిబ్బంది వ్యక్తిగత సమస్యలు, పిల్లల చదువులు, కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాలు, స్పౌస్ కోటాకు ప్రాధాన్యత కల్పించి వివిధ పోలీసు స్టేషన్లలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేశారు. ఎటువంటి సిఫార్సులకు తావులేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జిల్లా ఎస్పీ వ్యవహరించి కోరుకున్న చోటుకు బదిలీ చేయడంతో పోలీసు సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్, ఎస్‌బీసీఐ టీవీ సత్యనారాయణ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్ల అరెస్ట్

సింహాద్రిపురం : సింహాద్రిపురంలోని పీర్ల చావిడి సమీపంలో శుక్రవారం రాత్రి క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రోషన్ శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరు పరిచి, వివరాలు వెల్లడించారు. క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి ముగ్గురు క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్లను పట్టుకుని రెండు మొబైల్ ఫోన్లతోపాటు రూ.30,400 స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు ఏవైనా జరుగుతుంటే సమాచారం ఇచ్చే వారికి నగదు బహుమతి ఇవ్వడంతోపాటు వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు


గాయపడ్డ ఖాదర్‌వలీ

కలకడ : రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. కలకడ 108 సిబ్బంది కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోన పంచాయతీ బంగారువాండ్లపల్లె గ్రామానికి చెందిన నూర్‌సాహెబ్ కుమారుడు ఖాదర్‌వలీ(49) తన ద్విచక్రవాహనంలో గుర్రంకొండ నుంచి బంగారువాండ్లపల్లెకు బయలుదేరాడు. గుర్రంకొండ మండలం తుమ్మలగొంది పంచాయతీ టి.పసలవాండ్లపల్లెకు చెందిన మణికుమార్ (32), మోహన్ (34) కలిసి కలకడ నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళ్తున్నారు. ఎదురెదురుగా వస్తున్న వీరి బైక్‌లు బంగారువాండ్లపల్లె సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. ఖాదర్‌వలీని కలకడ 108 సిబ్బంది చలపతి, శ్రీనివాసులు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మునికుమార్, మోహన్‌ను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

గోడ కూలి..

మదనపల్లె : అకస్మాత్తుగా గోడకూలి మీదపడటంతో ఎలక్ట్రీషియన్ తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. కుక్కరాజుపల్లెకు చెందిన రహంతుల్లా (40) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతను స్థానికంగా నిర్మాణంలో ఉన్న ఇంటికి వైరింగ్ చేసేందుకు వెళ్లాడు. యంత్రం సాయంతో గోడను కోస్తుండగా ఒక్కసారిగా గోడకూలి మీదపడింది. ఈ ప్రమాదంలో రహంతుల్లా తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఔట్‌పోస్టు సిబ్బంది ప్రమాద సమాచారాన్ని తంబళ్లపల్లె పోలీసులకు తెలిపారు.

ఆకేపాటి సేవలు స్ఫూర్తిదాయకం


ఆకేపాటిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట టౌన్ : జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేద ప్రజలకు చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కొనియాడారు. టీబీ ముక్త్‌భారత్‌లో భాగంగా అమర్‌నాథ్‌రెడ్డి రెండు వందల మంది టీబీ పేషెంట్లను దత్తత తీసుకొని వారికి పౌష్టిక ఆహారం అందిస్తున్నందుకు కేంద్ర ఆరోగ్యశాఖ (మినిస్టరీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) ప్రశంసా పత్రం జారీ చేసింది. ఇందుకుగాను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చెన్నకృష్ణ ఆధ్వర్యంలో ఆకేపాటిని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమర్‌నాథ్‌రెడ్డి నిరంతరం ప్రజాసేవలో ఉంటారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని అందరూ తమ వంతు సేవ చేయాలని కోరారు. ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్యశాఖ ప్రశంసా పత్రాన్ని జారీ చేయడం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. టీబీ రోగులను దత్తత తీసుకోవడంలో రోటరీక్లబ్ ఆఫ్ అన్నమయ్య ప్రతినిధులు కూడా భాగస్వామ్యం అయ్యారని, ఈ వేడుకను వారితో కలిసి పంచుకోవడం మరింత సంతోషాన్నిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ న్యాయవాది వంకన గురుప్రతాప్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ శైలజ, ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటనాగేశ్వరరాజు, రైల్వేకోడూరు నోడల్ ఆఫీసర్ డాక్టర్ శేఖర్, టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సృజన, రాష్ట్ర సీహెచ్‌ఓఎస్ గౌరవ అధ్యక్షులు పిల్లి పిచ్చయ్య, టీబీ సూపర్‌వైజర్ జయప్రకాశ్, ఆకేపాడు, నందలూరు, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్ఐ, పోలీసులు

కేవీపల్లె : హత్య కేసులో ఇద్దరు నిందితులను శనివారం అరెస్ట్ చేశారు. కేవీపల్లె పోలీస్‌స్టేషన్‌లో కలకడ సీఐ పి.నాగేంద్ర, కేవీపల్లె ఎస్ఐ లోకేష్ నిందితులను హాజరు పరిచి, వివరాలు వెల్లడించారు. బద్వేలుకు చెందిన నరసింహులు రెండేళ్లుగా జిల్లేళ్ల మంద పంచాయతీ పెద్దతండాలో ఉంటూ మేస్త్రీగా పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో జిల్లేళ్లమంద పంచాయతీ దేవాండ్లపల్లెకు చెందిన రాజన్న ఇంటి పని చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇల్లు నిర్మాణ దశలో ఉంది. ఈ నెల 24న ఇంటి అడ్వాన్సు డబ్బుల విషయమై మేస్త్రీ నరసింహులు, రాజన్న గొడవ పడ్డారు. ఈ క్రమంలో గొడవ కాస్త పెద్దది కావడంతో రాజన్న ఓ కర్ర తీసుకుని నరసింహులు తలపై బలంగా కొట్టడంతో మృతి చెందాడు. నరసింహులును హత్య చేయడానికి పాతవడ్డిపల్లెకు చెందిన నాగులయ్య సహకరించాడు. దీంతో రాజన్న, నాగులయ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను అదుపులోకి తీసుకోవడంలో చురుగ్గా వ్యవహరించిన ఎస్ఐతోపాటు ఏఎస్ఐ మధుసూదనాచారి, హెచ్‌సీ మస్తాన్‌ప్రసాద్, పీసీలు మోహన్‌కుమార్, సుబ్బరాజు, డి.బి.వల్లి, అర్జున్, పురుషోత్తంలను ఎస్పీ ఆర్. గంగాధర్‌రావు, రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా అభినందించారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



టవర్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న హరీష్ కుమార్, హరీష్ కుమార్(ఫైల్)

వాల్మీకిపురం : ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని యర్రావాండ్లపల్లి వద్ద శనివారం చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంకొండ మండలం వంకాయలవారిపల్లికి చెందిన రైతు క్రిష్ణప్ప కుమారుడు హరీష్‌కుమార్ (22) డిగ్రీ పూర్తి చేసి వాల్మీకిపురంలోని ఒక ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో వాల్మీకిపురం మండలం గండబోయనపల్లి పంచాయతీ యర్రావాండ్లపల్లికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించాడు. ప్రేమ విఫలమైందని మనస్తాపం చెంది హరీష్ కుమార్ శుక్రవారం సాయంత్రం తను ప్రేమించిన యువతి స్వగ్రామానికి చేరుకొని ఎవ్వరూ లేని సమయం చూసి ఒక విద్యుత్ టవర్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం గమనించిన గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో సీఐ క్రిష్ణయ్య ఆధ్వర్యంలో పోలీసుల బృందం సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం యువకుడి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి మృతి పట్ల వారి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

వాల్మీకిపురంలో లోకాయుక్త విచారణ


విచారణ చేస్తున్న లోకాయుక్త విచారణ అధికారి, రెవెన్యూ సిబ్బంది

వాల్మీకిపురం : పట్టణంలోని కొత్త ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీలో 2019లో ఇచ్చిన ఇంటి పట్టాల పంపిణీ వ్యవహారంపై విశ్రాంత అడిషనల్ ఎస్పీ, లోకాయుక్త విచారణ అధికారి గంగరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. 2019లో అప్పటి తహసీల్దార్లు బాలక్రిష్ణమూర్తి, చెంద్రాయుడు ఆధ్వర్యంలో రేషన్ కార్డుదారులకు, జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఇంటి పట్టాల పంపిణీలో అవినీతి జరిగిందని, అనర్హులకు ఇచ్చారని లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ మేరకు లోకాయుక్త, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఫిర్యాదుదారుడి సమక్షంలో సమగ్ర విచారణ చేపట్టారు. అనంతరం నివేదికను లోకాయుక్తకు అందిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు మంజుల, ఫిరోజ్ ఖాన్, సర్వేయర్లు శ్రీనివాసులు, మురళి, వీఆర్‌వోలు మోహన, సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని నెమలినగర్‌కు చెందిన మానిక (25) కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లోనే క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య


మృతి చెందిన మహమ్మద్ రఫీ


మదనపల్లె : ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. వివరాలు.. మండలంలోని కొత్త ఇండ్లు గ్రామం గంగరాయి సమీపంలో నివసిస్తున్న మస్తాన్ కుమారుడు మహమ్మద్ రఫీ (27) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. శనివారం సాయంత్రం స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. అయితే ఏమి జరిగిందో తెలియదు గానీ, కుటుంబ సభ్యులతో ముభావంగా వ్యవహరించాడు. అనంతరం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు బాధితుని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందాడు. ఆస్పత్రికి చేరుకోగానే పరిశీలించిన వైద్యులు.. మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని మార్చరీకి తరలించారు. మృతునికి వివాహం కాలేదు. అయితే పుట్టినరోజు వేడుకలకు వెళ్లిన చోట ఏమైనా గొడవ జరిగి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడవికుక్కల దాడిలో నాలుగు దుప్పులు మృతి


మృతి చెందిన పొడదుప్పులు

సిద్దవటం : మండలంలోని ఎస్.రాజంపేట ఎస్సీ కాలనీ శివారులోని రిజర్వు ఫారెస్టు సమీపంలో శివారెడ్డి పొలం వద్ద శనివారం తెల్లవారు జామున అడవికుక్కల దాడిలో నాలుగు పొడదుప్పులు మృతి చెందాయని రేంజర్ ప్రసాద్ తెలిపారు. శనివారం తెల్లవారుజామున అడవి నుంచి పొడదుప్పి, దాని నాలుగు నెలల వయస్సున్న మూడు పిల్లలను అడవికుక్కల మంద తరుముకుంటూ వచ్చి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాయన్నారు. కళేబరాలను సిద్దవటంలోని పశు వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించామన్నారు. అనంతరం సాబ్‌బావి బేస్ క్యాంపు వద్ద ఖననం చేశామన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి రూ.40 లక్షల విరాళం


కరుణాకర్‌రెడ్డి అందజేసిన డీడీ చూస్తున్న ఎమ్మెల్యే

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని సంగమేశ్వర ఆలయం వద్ద కల్యాణ మండపం నిర్మాణానికి షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ అధినేత నర్రెడ్డి విశ్వేశ్వర్‌రెడ్డి రూ.40 లక్షలు విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. కల్యాణ మండపం నిర్మించాలని ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి.. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ అధినేత నర్రెడ్డి విశ్వేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే టీటీడీ అధికారులతో మాట్లాడారు. దీంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో రూ.2 కోట్లతో కల్యాణ మండపం నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి మ్యాచింగ్ గ్రాంటు 40 లక్షల రూపాయలు చెల్లించేందుకు కడపలోని షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ అధినేత నర్రెడ్డి విశ్వేశ్వర్‌రెడ్డి ముందుకు వచ్చారు. ఇందుకు సంబంధించిన డీడీని విశ్వేశ్వర్‌రెడ్డి సోదరుడు ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు కరుణాకర్‌రెడ్డి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కీళ్ల వైద్యుడు జయసోమేశ్వర్‌రెడ్డి, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.